సాక్షి రంగారెడ్డి

మంగళవారం : 18 : మార్చి : 2025



జ్వరమని వెళ్తే..

జ్వరం వచ్చి ందని ఆస్పత్రికి తీసుకెళ్తే.. వైద్యుల నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి చెందాడని మృతుడి కుటుంబీకులు ఆరోపించారు. 8లో▸



ఇటుక బట్టీలపై..

ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో ఇటుక బట్టీలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళవారం సా. 6.32 గం.	బుధవారం ఉ. 5.00 గం.

న్యూస్‌రీల్

డబుల్‌రోడ్డుకు అనుమతివ్వండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే కసిరెడ్డి



ఆమనగల్లు: రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాలను కలిపే కడ్తాల్ నుంచి కొత్త ఎక్స్‌రోడ్డు వరకు ఉన్న రోడ్డులో.. అటవీ భూమిలో డబుల్‌రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. సోమవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే ఈ విషయాన్ని ప్రస్తావనకు తెచ్చారు. సుమారు రెండు దశాబ్దాల క్రితం రెండు వరుసలుగా రహదారిని నిర్మించారని తెలిపారు. మాదారం దాటిన తరువాత అటవీశాఖ భూమిలో 1.5 కిలో మీటర్ల రోడ్డు ఉందని, ఆ శాఖ అనుమతి లేకపోవడంతో రోడ్డు నిర్మించలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సింగిల్‌రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారిందని, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. సింగిల్ రోడ్డును డబుల్‌రోడ్డుగా నిర్మించాలని కోరారు. దీనిపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. అంతకు ముందు కల్వకుర్తి ఆర్టీసీ డిపోనకు నూతనంగా 16 కొత్త బస్సులను కేటాయించడంపై ఎమ్మెల్యే కసిరెడ్డి మంత్రి పొన్నంకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుల నియామకం

- అర్బన్ అధ్యక్షుడిగా వి.శ్రీనివాస్‌రెడ్డి
- రాజ్‌భూపాల్‌గౌడ్‌కు రూరల్ జిల్లా బాధ్యతలు



శ్రీనివాస్‌రెడ్డి



రాజ్‌భూపాల్‌గౌడ్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: బీజేపీ రంగారెడ్డి జిల్లా రూరల్ అధ్యక్షుడిగా శంషాబాద్ మండలం పాలమాకులకు చెందిన పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్, జిల్లా అర్బన్ అధ్యక్షుడిగా వి.శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆ పార్టీ జిల్లా ఎన్నికల అధికారి కట్ట సుధాకర్‌రెడ్డి వీరికి నియామకపత్రం అందజేశారు. 1970లో జన్మించిన రాజ్‌భూపాల్‌గౌడ్ బాల్య స్వయం సేవక్‌గా పని చేశారు. 1995లో బీజేపీ పాలమాకుల గ్రామ కమిటీ అధ్యక్షుడిగా, 1997లో యువమోర్చా మండల అధ్యక్షుడిగా, 2000లో యువమోర్చా జిల్లా అధ్యక్షుడిగా, 2007లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, 2015లో జాతీయ కార్యవర్గ సభ్యుడిగా పని చేశారు. 2009లో రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2024లో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. మూడు దశాబ్దాలుగా బీజేపీతో ఆయనకు అనుబంధం ఉంది. ప్రస్తుతం పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టడంపై ఆయన సన్నిహితులు, కార్యకర్తలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కాగా.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాలకు చెందిన శ్రీనివాస్‌రెడ్డికి డ్రాగన్ ఫ్రూట్ రైతుగా పేరుంది. ప్రస్తుతం ఆయన వనస్థలిపురంలో ఉంటున్నారు.

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా గోవిందమ్మ



శంకర్‌పల్లి: మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మండలంలోని మహాలింగాపురం గ్రామానికి చెందిన గోవిందమ్మను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైస్ చైర్మన్‌గా శంకర్‌పల్లి పట్టణానికి చెందిన చంద్రమోహన్‌తో పాటు మరో 16మంది సభ్యులతో కూడిన కమిటీని నియమించింది. ఈ సందర్భంగా గోవిందమ్మ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి, ఈ అవకాశం కల్పించినందుకు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే యాదయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. పాలకవర్గం ప్రమాణస్వీకారం తేదీ ఖరారు కావాల్సి ఉంది.

సిటీ హీటెక్కుతోంది!

మరో మూడ్రోజులు భానుడి భగభగలు

సాక్షి, సిటీబ్యూరో: నగరం గరం అవుతోంది. ఉదయం 7 గంటలకే భానుడు భగ్గుమంటున్నాడు. మధ్యాహ్నం ఎండలు మండుతున్నాయి. గత రెండు రోజులుగా గరిష్ట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీలు నమోదవుతున్నాయి. మరో మూడు రోజుల పాటు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నెలాఖరులోగా 45 డిగ్రీలకు చేరి వడగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఒంటి పూట బడులు ప్రారంభం కావడంతో మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చే సమయంలో విద్యార్థులు ఎండలకు తల్లడిల్లుపోతున్నారు. సోమ వారం గోల్కొండ, ముషీరాబాద్, చార్మినార్, బహదూర్‌పురా, బండ్లగూడ, అంబర్‌పేట, మారేడుపల్లి, హిమాయత్ నగర్, షేక్‌పేట్, ఖైరతాబాద్, సైదాబాద్‌లలో గరిష్టంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

'ప్రజావాణి' దండగ

సమస్యలు తీరవు, బాధలు పట్టవు

- కాగితాలు తీసుకొని పొమ్మంటున్నారు
- ఫిర్యాదుదారుల ఆవేదన
- ప్రజావాణికి 72 దరఖాస్తులు

ఇబ్రహీంపట్నం రూరల్: 'సత్వర న్యాయం కోసం ఏర్పాటు చేసిన ప్రజావాణిలో సమస్యలు పరిష్కారం కావడం లేదు. ప్రజావాణి దండగ' అని ఫిర్యాదు దారులు వాపోతున్నారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి చెప్పులు అరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగితం తీసుకునే వరకు లైన్లో ఉండాలని, మేడమ్ వద్దకు వెళ్లగానే ఏం మాట్లాడకుండా కాగితం తీసుకొని పోలీసుల చేత వెనక్కి పంపిస్తున్నారని పేర్కొంటున్నారు. సమస్యలు తీరవు, మా బాధలు ఎవరికీ పట్టవు. ఇక మాకు చావేదిక్కని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న, అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

72 ఫిర్యాదులు

ప్రతివారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి ఫిర్యాదుల పరంపర కొనసాగుతోంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు రెవెన్యూ, ఇతర సమస్యలపై చేవెళ్ల, కొందుర్గు, కొత్తూరు, ఇబ్రహీంపట్నం, శంషాబాద్, షాబాద్, ఆమనగల్లు తదితర ప్రాంతాల నుంచి అత్యధికంగా ఫిర్యాదులు వస్తున్నాయి. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 72 ఫిర్యాదులు అందాయి. ఇందులో రెవెన్యూ శాఖకే ఏకంగా 40 అర్జీలు రాగా, ఇతర శాఖలకు 32 వచ్చాయి. ఈ దరఖాస్తుల స్వీకరణలో అదనపు కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్, మండల తహసీల్దార్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

బువ్వ పెట్టరు.. మాట్లాడరు



ఎంతో పౌరుషంగా బతికా. పిల్లలకు ఆస్తులు ఇస్తే నన్ను రోడ్డున పడేశారు. నాకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉంది. ప్రస్తుతం ఓల్డేజ్ హోంలో బతుకుతున్నా. 5.18 ఎకరాల భూమి, పనామా గోదాం వద్ద అపార్ట్‌మెంట్ ఉంది. నెలకు రూ.15 వేలు ఇస్తారు. కానీ బువ్వ పెట్టరు. నాతో ఎవరూ మాట్లాడరు.. బాధపెడ్తున్నారు.

– ఎల్లారెడ్డి, వృద్ధుడు

న్యాయం చేస్తలేరు చచ్చిపోతా



నా కుమారుడు శ్రీనివాస్ రెడ్డి విదేశాలకు వెళ్తానంటే 5 ఎకరాల పొలం అతని పేరుమీద చేశాను. భార్య చనిపోయింది. ఐదు మంది బిడ్డలు ఉన్నారు. ఆరోగ్యం బాగా లేదు. నన్ను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆర్డీఓ వద్దకు వెళ్లిన, కలెక్టరమ్మ దగ్గరకు వెళ్లినా న్యాయం జరగడం లేదు. నన్ను సాదే వారే లేరు. చచ్చిపోవాలనుంది.

– మల్లారెడ్డి, మల్లాపూర్

పదేళ్ల నుంచి తిరుగుతున్నా



కేసీఆర్ పోయిండు, రేవంత్ రెడ్డి వచ్చిండు. అయినా మా సమస్య తీరడం లేదు. ఆమనగల్లు మండలం ముద్విజపల్లి గ్రామంలో సర్వే నంబర్ 124లో 37 గుంటల పొలం ఉంది. ఆన్‌లైన్ చేయమంటే ఎవరూ పట్టించుకోవడం లేదు. 2005 సంవత్సరం నుంచి తిరిగి తిరిగి చెప్పులు అరుగుతున్నాయి.

– కుపురెడ్డి నారాయణరెడ్డి, ముద్విజపల్లి



ప్రమాణస్వీకార మహోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఏక కాలంలో రూ.2 లక్షలు మాఫీ చేసిన ఘనత మాదే
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

మహేశ్వరం: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఒకేసారి రూ.2 లక్షలు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ సర్కార్‌కే దక్కిందని పేర్కొన్నారు. సాంకేతిక కారణాలతో కొంత మందికి రుణమాఫీ కాలేదని, వాటిని పరిశీలించి అర్హులందరికీ మాఫీ అయ్యేలా చూస్తామని చెప్పారు. దీనిపై ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీలు తప్పుడు ప్రచారం చేస్తున్నామని, వాటిని పార్టీ శ్రేణులు తిప్పి కొట్టి, ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణస్వీకార మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

భూ బాధితులను ఆదుకుంటాం

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు భూములు కోల్పోతున్న రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని, పరిశ్రమలు వస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి తెలిపారు. మార్కెట్ కమిటీ పాలకవర్గంలో ఎస్టీ గిరిజన, బీసీ రజక సామాజిక వర్గాలకు చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు దక్కాయని మంత్రి అన్నారు. అంతకు ముందు పాలకవర్గ సభ్యులు చైర్మన్ సభావత్ కృష్ణా నాయక్, వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, డైరెక్టర్లుగా పుష్ప, ప్రశాంత్ కుమార్, కె.యుగేందర్, సురేందర్, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎంఏ.జావీదు, బోధ పాండు రంగారెడ్డి, యాదయ్య, ధన్‌పాల్ రెడ్డి, పాండు మార్కెటింగ్ శాఖ అధికారుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ అభివృద్ధికి, రైతు సంక్షేమానికి కృషి చేస్తామని సభ్యులు పేర్కొన్నారు. మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చైర్మన్ నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, జెడ్పీ చైర్‌పర్సన్ మాజీ సభ్యురాలు అనితారెడ్డి, పీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్‌లీడర్ జంగారెడ్డి, ఎస్సీసెల్ కన్వీనర్ నర్సింహ, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి పాల్గొన్నారు.



అబ్దుల్లాపూర్‌మెట్: సాండ్ బజార్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి, టీఎస్‌ఎండీసీ చైర్మన్ అనిల్

ఆన్‌లైన్‌లో ఇసుక

- టీజీఎండీసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ సాండ్ బజార్లు
- సన్న ఇసుక టన్నుకు రూ.1,800, దొడ్డుది రూ.1,600
- అందుబాటులోకి అబ్దుల్లాపూర్‌మెట్ సాండ్‌బజార్..
- నేడు మేడ్చల్ జిల్లా బౌరంపేటలో,
- రేపు వట్టినాగులపల్లిలోనూ ప్రారంభం

సాక్షి, రంగారెడ్డి: ఇసుక అక్రమ దందాకు ప్రభుత్వం చెక్ పెట్టాలని నిర్ణయించింది. ఇసుక బుకింగ్, తరలింపులో దళారుల ప్రమేయం లేకుండా పూర్తి పారదర్శకంగా నాణ్యమైన ఇసుకను నిర్మాణదారులకు అందజేయాలని భావిస్తోంది. ఈ మేరకు రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సాండ్ బజార్‌లను ప్రారంభించాలని తీర్మానించింది. ఈ మేరకు సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో సాండ్ బజార్‌ను ప్రారంభించింది. మంగళవారం మేడ్చల్ జిల్లా బౌరంపేటలో, బుధవారం రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో మరో రెండు కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వమే స్వయంగా క్వారీల నుంచి ఇసుకను లారీల్లో ఇక్కడికి తరలించి, నిర్మాణదారులకు సరఫరా చేయనుంది. సన్న ఇసుక టన్నుకు రూ.1800, దొడ్డు ఇసుక టన్నుకు రూ.1600 ధరగా నిర్ణయించింది. భవన నిర్మాణదారులు మీ సేవ కేంద్రాల్లో/టీజీఎండీసీ వెబ్‌సైట్‌లో నేరుగా ఇసుకను బుక్ చేసుకునే అవకాశం కల్పించింది.

రోజుకు 50 వేల టన్నులు..

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో భారీ సంఖ్యలో భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. వ్యక్తిగత నివాసాలతో పాటు అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల నిర్మాణం కోసం ఇసుక అవసరం. నగరంలో రోజుకు సగటు 50 వేల టన్నుల ఇసుక అవసరం ఉంటుందని అంచనా. కాళేశ్వరం, కరీంనగర్, భద్రాచలం, జాజిరెడ్డిగూడెం నుంచి గత నెల వరకు రోజుకు సగటున 1,400 లారీల్లో ఇసుకను తరలించగా, ప్రస్తుతం ప్రభుత్వ లోడింగ్‌పై విధించిన ఆంక్షలతో ఇసుక తరలించే లారీల సంఖ్య రెండు వేలకు చేరుకుంది. గతంలో ఒక్కో లారీలో 50 టన్నులకుపైగా ఇసుక తరలిస్తే.. ప్రస్తుతం 25 టన్నులే వస్తోంది. ఫలితంగా ఇసుకను తరలించే లారీల సంఖ్య ప్రస్తుతం రెండు వేలకు చేరింది. ఆయా లారీల యజమానులు ప్రభుత్వ క్వారీల నుంచి ఇసుకను లోడ్ చేసుకుని వచ్చినగర శివారు ప్రాంతాల్లోని ఆటోనగర్, ఉప్పల్, మంద మల్లమ్మ చౌరస్తా, ఉప్పరిగూడ, శివరాంపల్లి, ఉప్పల్ రింగ్‌రోడ్డు, బోడుప్పల్ ప్రధాన రహదారి వెంట ఉన్న ఖాళీ స్థలాల్లో నిలిపి అమ్ముతుంటారు.

దళారులకు ఇక చెక్..

దళారులు ఆయా లారీల యజమానులతో ముందే కుమ్మక్కై ఇసుక ధరను అమాంతం పెంచేస్తున్నారు. అంతేకాదు.. ఏకధాటి వర్షాలకు వాగుల్లో వరదలు పోటెత్తే సమయంలో కృత్రిమ కొరత సృష్టించి, అప్పటికే డంపింగ్ కేంద్రాల్లో నిల్వ చేసిన ఇసుకకు భారీ ధరలు నిర్ణయించి అమ్ముతున్న విషయం తెలిసిందే. సాధారణంగా మార్చి, ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో టన్ను రూ.1200 లోపే దొరికే ఇసుక.. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ మాసాల్లో ఏకంగా రూ.2500 నుంచి రూ.3000 వరకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక లేకపోతే పని ఆగిపోయే ప్రమాదం ఉందని భావించి ఇష్టం లేకపోయినా నిర్మాణదారులు వారు చెప్పిన ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఇసుక అక్రమ దందాకు చెక్ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. క్వారీలపై నిఘా పెంచింది. ప్రస్తుతం ఆయా ఇసుక క్వారీలన్నింటిని తమ చేతుల్లోకి తీసుకుంది. ఓవర్‌లోడు కారణంగా రహదారులు దెబ్బ తినకుండా చెక్ పెట్టేంది. అంతేకాదు బహిరంగ మార్కెట్లో ఇసుక అధిక ధరలకు కళ్లెం వేసినట్లయింది.

సామాన్యుడికి అందుబాటులో..

'సాండ్ బజార్'లో తక్కువ ధరకే లభ్యం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



విక్రయానికి సిద్ధంగా ఇసుక

అబ్దుల్లాపూర్‌మెట్: దళారీ వ్యవస్థను అరికట్టి, సామాన్యుడికి తక్కువ ధరకు ఇసుక అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని కార్పొరేషన్ చైర్మన్ అనిల్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో ఇసుక విక్రయ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో టీఎస్‌ఎండీసీ ఎండీ.సుశీల్‌కుమార్, జనరల్ మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి, మైనింగ్ శాఖ ఏడీ నర్సిరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి, ఎంపీడీఓ శ్రీవాణి పాల్గొన్నారు.

లారీ, బైక్ ఢీ.. యువకుడి మృతి



లారీ కింద ఇరుక్కుపోయిన బైక్



సాయికుమార్ (ఫైల్)

చేవెళ్ల: లారీ బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధి ఖానాపూర్ బస్‌స్టేజీ సమీపంలోని హైదరాబాద్– బీజాపూర్ రహదారిపై సోమ వారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం.. చేవెళ్ల గ్రామానికి చెందిన భగీర్తి వెంకటయ్య, సుమిత్రలకు ఇద్దరు కూతుర్లు, ఓ కుమారుడు బి.సాయికుమార్(20) ఉన్నారు. ఇద్దరు కూతుర్ల వివాహం చేశారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో సాయి పదో తరగతితోనే చదువు ఆపేసి, ప్రైవేటు పనులు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఎప్పటి లాగే యువకుడు పనికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ యువకుడు నడుపుతున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను ఎగిరి కిందపడగా.. బైక్‌తో పాటు యువకుడి తలపై నుంచి లారీ ముందుకు దూసుకుపోయింది. దీంతో సాయి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. వివరాలు సేకరించారు. లారీని డ్రైవర్ అక్కడే వదిలేసి పారిపోయాడు. మృతుడు సాయికుమార్‌గా గుర్తించిన పోలీసులు, తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. అనంతరం మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. కుటుంబానికి ఆధారంగా ఉన్న ఒక్కగానొక్క కొడుకు మరణంతో ఆ తల్లిదండ్రుల రోదనలు అందరినీ కలచివేశాయి.

ఇటుక బట్టీలపై విజిలెన్స్ దాడులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో ఇటుక బట్టీలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. వ్యవసాయ పొలాలకు వినియోగించే విద్యుత్‌ను, అక్రమంగా పరిశ్రమలకు వాడుతున్నారన్న సమాచారంతో విజిలెన్స్ ఏడీ మోషా ఆధ్వర్యంలో సోమవారం పలు చోట్ల దాడులు నిర్వహించారు. 5 చోట్ల కేసులు నమోదు చేశామని అధికారులు తెలిపారు. తప్పనిసరిగా కమర్షియల్ మీటర్లు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.



యజమానులపై కేసు నమోదు చేస్తున్న అధికారులు

జ్వరమని వెళ్తే.. ప్రాణం తీశారు!

కుటుంబీకులు, బంధువుల ఆరోపణ
- ఆస్పత్రి ఎదుట ధర్నా



సామ్యనాయక్ (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: జ్వరం వచ్చిందని ఆస్పత్రికి తీసుకెళ్తే.. వైద్యుల నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి చెందాడని మృతుడి కుటుంబీకులు ఆరోపించారు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేశంపేట మండలం కోనాయపల్లి గ్రామ పంచాయతీ పరిధి లచ్యానాయక్‌తండాకు చెందిన సామ్యనాయక్(50)కు జ్వరం వచ్చిందని కుటుంబ సభ్యులు ఈ నెల 14న పట్టణంలోని ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకువచ్చారు. అతన్ని పరీక్షించిన ఆర్‌ఎంపీ.. తాను నిర్వహిస్తున్న బాలాజీ ఆస్పత్రికి రిఫర్ చేశాడు. అనంతరం అక్కడ వైద్య పరీక్షలు చేసిన వైద్యులు.. సామ్యనాయక్‌కు డెంగీ ఉందని చెప్పారు. చికిత్స పొందుతున్న వ్యక్తికి.. ప్లేట్‌లెట్స్ క్రమంగా తగ్గుతుండటంతో.. మెరుగైన వైద్యం



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు

కోసం నగరానికి తీసుకెళ్తామని ఆస్పత్రి యాజమాన్యానికి కుటుంబీకులు చెప్పినా.. వినిపించుకోలేదు. ఇక్కడ మంచి వైద్యం అందిస్తామని చెప్పారు. ఈ క్రమంలో నాయక్ ఆరోగ్య పరిస్థితి విషమించి ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. గమనించిన వైద్యులు సీపీఆర్ చేశారు. రోగి మృతి చెందాడని నిర్ధారించుకున్న వైద్యులు, యాజమాన్యం ఆస్పత్రి షట్టర్స్‌ను మూసి వేశారు. మృతుడి కుటుంబీకులు కిందకు వెళ్లి తిరిగి పైకి వచ్చే సరికి.. గుట్టు చప్పుడు కాకుండా మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బంధువుల ఆందోళన

సామ్యనాయక్ మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడంతో మృతుడి కుటుంబీకులు, బంధువులు ఆదివారం అర్ధరాత్రి బాలాజీ హాస్పిటల్ ఎదుట ఆందోళనకు దిగారు. సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని ఎలా తరలించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. యాజమాన్యంతో వాగ్వివాదానికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, బందోబస్తు నిర్వహించారు. సోమవారం ఉదయం మరోసారి ఆందోళన చేశారు. 'మా నాన్న చావుకు ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యమే' కారణమని మృతుడి కుమారుడు రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాంచందర్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు.

చికిత్స పొందుతూ.. వ్యక్తి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

హుడాకాంప్లెక్స్: సరూర్ నగర్ డివిజన్ పరిధి సాయితేజ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. భూదాన్ పోచంపల్లికి చెందిన మహేశ్(26) గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడుతూ.. ఆదివారం ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. గుండెనొప్పితో మహేశ్ చనిపోయాడని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో ఆగ్రహించిన కుటుంబీకులు సోమవారం ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు.. ఇరువురి మధ్య సయోధ్య కుదిర్చి సమస్యను పరిష్కరించారు. కాగా.. బాధితులకు ఆస్పత్రి యాజమాన్యం పరిహారం అందజేసినట్లు సమాచారం.

కొందుర్గులో.. మరొకరు

కొందుర్గు: షాద్‌నగర్ పట్టణంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లేడ్ చౌదరిగూడ గ్రామానికి చెందిన పల్లె సంగీత, పల్లె రామానుజమ్మ, ఎల్లమ్మ తదితరులు గొడవపడ్డారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12న పల్లె రామనుజమ్మ, ఆమె కుమారుడు కలిసి పల్లె అనంతరాములపై కర్రతో దాడి చేశారు. ఈ ఘటనలో రాములు తలకు బలమైన గాయం కావడంతో బుగ్గారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతిచెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చౌదరిగూడ ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు.

ప్రజలు భయందోళన చెందొద్దు

తాండూరు రూరల్: మండల పరిధిలోని మల్కాపూర్, సంగెంకలాన్ గ్రామస్తులు భయందోళన చెందవద్దని అటవీశాఖ తాండూరు సెక్షన్ ఆఫీసర్ ఫిర్యానాయక్ సూచించారు. మల్కాపూర్ శివారులోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ క్వారీలో చిరుతపులి పిల్ల సంచరిస్తున్న నేపథ్యంలో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం మల్కాపూర్‌లో సిమెంట్ ఫ్యాక్టరీ క్వారీ సమీపంతో పాటు సంగెంకలాన్ శివారులో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫిర్యానాయక్ మాట్లాడుతూ... తాండూరు ఫారెస్ట్ రేంజ్ అధికారిణి శ్రీదేవి సరస్వతి ఆదేశాల మేరకు మూడు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. చిరుతపులి పిల్ల సంచరిస్తే ట్రాప్ కెమెరాలు దృశ్యాలు నమోదు అవుతాయని చెప్పారు. అట్టి దృశ్యాల ఆధారంగా ఎలాంటి చర్యలు చేపట్టాలనే విషయాలపై చర్చిస్తామన్నారు. కార్మికులతో పాటు ఆయా గ్రామస్తులు చిరుతపులి పిల్ల కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజలు ధైర్యంగా ఉండాలని సూచించారు.

ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేస్తే సహించం



కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్
- కలెక్టరేట్ ఎదుట 48 గంటల దీక్ష

ఇబ్రహీంపట్నం రూరల్: అంగన్ కేంద్రాలను నిర్వీర్యం చేయాలని చూస్తే సహించేది లేదని సీఐటీయూ జిల్లా కమిటీ హెచ్చరించింది. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు రాజ్యలక్ష్మి, కవితల ఆధ్వర్యంలో సోమవారం 48 గంటల దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజు, చంద్రమోహన్‌లు మాట్లాడుతూ.. ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసి, పీఎం శ్రీ పథకాన్ని, మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలను తీసుకురావాలని చూస్తుందని, ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధాన చట్టాన్ని అమలు చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, మినీ టీచర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు.

మూత పడనున్న ఐసీడీఎస్‌లు

పీఎం శ్రీ పథకం కింద ప్రీ ప్రైమరీ కేంద్రాలను 28 జిల్లాల్లో 56 కేంద్రాలను ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, మొబైల్ అంగన్‌వాడీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకానికి తెరలేపిందని ఆరోపించారు. తద్వారా ఐసీడీఎస్‌లు పూర్తిగా మూతపడే అవకాశం లేకపోలేదని, దీంతో పేద పిల్లలకు పౌష్టికాహారం దూరం కానుందని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందు అనేక హామీలను ఇచ్చి నేడు, విస్మరిస్తుందని విమర్శించారు. టీఏ, డీఏలు పెంచాలని, అంగన్‌వాడీ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. బీఎల్‌ఓ డ్యూటీలు రద్దు చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో అంగన్‌వాడీల బలోపేతానికి బడ్జెట్ కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, జగన్, జిల్లా నాయకులు కిషన్, దేవేందర్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్దే రాత్రి బస

48 గంటలు దీక్షకు పిలుపునివ్వడంతో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు రాత్రి కలెక్టరేట్ కార్యాలయం వద్దే బస చేశారు. అక్కడే వంటావార్పు చేశారు. రోడ్డుపైనే టెంట్ల కింద పడుకున్నారు. ఆట పాటలతో బతుకమ్మలు ఆడి సరదాగా గడిపారు. డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకు కదిలేది లేదని స్పష్టంచేశారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితుడు

మాడ్గుల: మండల పరిధి కొల్కులపల్లిలో వైన్ షాప్‌లో చోరీకి పాల్పడిన నేనావత్ సాయికుమార్‌ను సోమవారం అరెస్టు చేశామని సీఐ వేణుగోపాలరావు తెలిపారు. జనవరి ఒకటిన మద్యం దుకాణంలో దొంగతనం చేశాడని, నిందుతున్ని మాడ్గుల ఎక్స్ రోడ్ వద్ద అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచామని సీఐ వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

కేశంపేట: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండల పరిధి వేములనర్వ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్డె అనంత(44), భర్త గతంలో మరణించడంతో కుమారుడితో కలిసి ఉంటోంది. మృతురాలు కొంత కాలంగా ఆరోగ్య సమస్యలతో పాటు.. ఆర్థిక సమస్యలతో బాధపడుతోంది. దీంతో మనస్తాపం చెందిన ఆమె.. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి మామ వడ్డె కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నరహరి తెలిపారు.

వ్యర్థాలకు నిప్పు



ఎగిసి పడుతున్న మంటలు

షాద్‌నగర్‌రూరల్: పట్టణ శివారులోని అన్నారం వై జంక్షన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు వ్యర్థాలకు నిప్పు పెట్టారు. బుధవారం మధ్యాహ్నం వై జంక్షన్ సమీపంలోని ఉడిపి హోటల్ వెనకాల ఉన్న చెత్తకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో, వారు మంటలను ఆర్పారు.

కారు, డీసీఎం ఢీ..

ఇద్దరికి గాయాలు

కేశంపేట: ఎదురెదురుగా డీఎసీఎం, కారు ఢీకొన్న సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కార్తీక్, కీర్తన్‌లు కంటి ఆస్పత్రికని షాద్‌నగర్‌కు వచ్చారు. తిరిగి గ్రామానికి రాత్రి వెళ్తున్న క్రమంలో మండల పరిధి ఇప్పలపల్లి గ్రామ శివారు ఐరన్ ఫ్యాక్టరీ వద్ద ఎదురుగా వచ్చిన డీసీఎం కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న ఇద్దరికి గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు క్షతగాత్రులను షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోమవారం బాధితుడి తండ్రి కరుణాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నరహరి తెలిపారు.

కందుకూరులో.. ఆరుగురికి

కందుకూరు: కారు, డీసీఎం ఢీకొన్న సంఘటనలో ఆరుగురు గాయపడ్డారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి శ్రీశైలం రహదారి అలిఖాన్‌పల్లి గేట్ వద్ద కల్వకుర్తి వైపు నుంచి వస్తున్న కారు, కడ్తాల్ వైపు కోళ్ల లోడుతో వెళ్తున్న డీసీఎం.. ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు, డీసీఎం డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. కాగా వారి వివరాలు తెలియరాలేదు. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

మహేశ్వరంలో.. ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

మహేశ్వరం: ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ సంఘటన మండల పరిధి తుమ్మలూరు–మహేశ్వరం రోడ్డులో చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. కందుకూరు మండలం గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన ఉండెల శివకుమార్(23) డ్రైవింగ్ చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి మహేశ్వరం నుంచి గుమ్మడవెల్లి గ్రామానికి పల్సర్ బైక్‌పై వెళ్తుండగా, మహేశ్వరం గ్రామానికి చెందిన రెవేళ్ల యాదగిరి రాయుడు, సురేష్ ఇద్దరు బైక్‌పై తుమ్మలూరు నుంచి మహేశ్వరం వస్తున్నారు. ఈ క్రమంలో రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శివకుమార్‌కు తీవ్రగాయాలై నగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. గాయపడిన ఇద్దరు చికిత్స పొందుతున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రాణం పోయినా భూములివ్వం

- మొండిగౌరెల్లి రైతుల తీర్మానం



జీపీ కార్యాలయం ఎదుట సమావేశమైన రైతులు

యాచారం: పారిశ్రామిక పార్కుల పేరుతో అసైన్డ్, పట్టా భూములను బలవంతంగా తీసుకుంటామంటే ఊరుకునేది లేదని, ప్రాణం పోయినా భూములిచ్చేది లేదని మొండిగౌరెల్లి గ్రామ రైతులు స్పష్టం చేశారు. నేలతల్లిని నమ్ముకుని జీవనోపాధి పొందుతున్న తమ భూములను గుంజుకుంటామంటే ఎక్కడికి పోవాలని ఆవేదన వ్యక్తంచేశారు. పారిశ్రామిక పార్కులకోసం గ్రామంలోని పలు సర్వే నంబర్లలోని 822 ఎకరాల భూమిని తీసుకోవడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో రైతులు సోమవారం జీపీ కార్యాలయం ఎదుట సమావేశం అయ్యారు. సర్కారు భూములు తీసుకోకుండా అడ్డుకుందామని, సమష్టిగా పోరాటం చేద్దామని తీర్మానించారు. ఇందులో భాగంగా టి.రవీందర్, బి.కృష్ణ, సందీప్‌రెడ్డి, సంగెం రవి, ప్రవీణ్ కుమార్‌లతో పాటు మరో 30 మందితో కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు, తహసీల్దార్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ, కలెక్టర్‌కు వినతిపత్రాలు, న్యాయపరంగా కోర్టుకు వెళ్లడానికి కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. మాజీ సర్పంచ్ అంజయ్య యాదవ్, రైతులు మేకల యాదగిరిరెడ్డి, శ్రీనివాస్ యాదవ్, బాలరాజ్, జంగయ్య, శ్రీకాంత్‌రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కదులుతున్న కారులో మంటలు

సకాలంలో స్పందించడంతో తప్పిన ముప్పు

లాలాపేట: హబ్సిగూడ ప్రధాన రహదారిపై వెళ్తున్న ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. అందులో ప్రయాణిస్తున్న వారు వెంటనే కిందకు దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగిన ఘటనపై పోలీసులు తెలిపిన మేరకు.. వారాసిగూడకు చెందిన నాగరాజు జనగామ నుంచి బస్సులో వచ్చిన తన భార్యా పిల్లలను ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద మారుతి స్విఫ్ట్ కారులో ఎక్కించుకుని (ఏపీ 09 బీజే 2366) ఉప్పల్ వైపు నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్నాడు. వీరి కారు హబ్సిగూడ రోడ్డు నెంబర్ 6 వద్దకు రాగానే ఇంజిన్ వేడెక్కి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ నాగరాజు వెంటనే కారును రోడ్డు పక్కన నిలిపాడు. స్థానికులు, పోలీసుల సహాయంతో కారు వెనక డోర్లు ఓపెన్ చేసి భార్యా పిల్లలను కూడా బయటకు దింపారు. సమాచారం అందుకున్న మౌలాలి ఫైర్ స్టేషన్ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని మంటలను ఆర్పేశారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రయ్య

తాండూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి పండిత్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ... కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం సరికాదన్నారు. కార్పొరేట్ యాజమన్యాలకు అనుకూలంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ లేబర్ కోడ్‌లతో దేశంలో ఉన్న 55 కోట్ల మంది కార్మికుల ఆగ్రహానికి కేంద్ర ప్రభుత్వం గురికావడం తథ్యమన్నారు. న్యూ ఢిల్లీలో మంగళవారం జరిగే ఉమ్మడి కార్మిక సంఘాల జాతీయ సదస్సును విజయవంతం చేయాలన్నారు. అనంతరం సీసీఐ ఫ్యాక్టరీ జీఎంను కలిసి సీసీఐ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ యజమాన్యం వేజ్ బోర్డు ప్రకారం కార్మికులకు వేతనాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్, జిల్లా గౌరవ అధ్యక్షుడు బాలశంకర్, నాయకులు రవీందర్, వంశీకృష్ణ, రెడ్డి సురేష్, దస్తప్ప, లాహేర్ బాషా, మోహన్, వెంకటేష్, దశరథ్‌గౌడ్, దస్తప్ప పాల్గొన్నారు.